క్లుప్తంగా

సీతారాంపూర్ జీపీ భవనం ప్రారంభం



దామెర: మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్ రెడ్డి, సర్పంచ్ తుత్తురు శ్రీనివాస్, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, బీఆర్ఎస్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి మాత్రమే హాజరుకాగా, ఇతర అధికారులు, అధికార పార్టీ నాయకులెవరూ హాజరుకాకపోవడం గమనార్హం.

నిత్యం లీకేజీమయం



శాయంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిత్యం లీకేజీ అవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో నిర్మించిన ఔట్‌పుట్ పైపులైన్ లీకేజీ అవుతు భారీగా నీరు వృధా అవుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో భారీగా నీరు వృధా అవుతున్న వాటర్ ట్యాంకు అవుట్‌పుట్ పైపును మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

వేలేరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మద్దెలగూడెం సమీపంలోని కొమ్ముగుట్ట క్రాస్‌వద్ద గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరు మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన వంగ మల్లేష్ తన బంధువుల ఇంట్లో జరిగిన ఓ ఫంక్షన్‌కు నర్మెటమండలంలోని గండి రామారం గ్రామానికి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మల్లేష్ తన గ్రామానికి వెళ్తుండగా షోడాషపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల స్వామి తన ద్విచక్రవాహనంపై మద్దెలగూడెం మీదగా లింగంపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లు వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వంగ మల్లేష్‌కు కాలు విరగడంతో పాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఐనవోలు: మండలంలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి(70) అనారోగ్యంతో మతి చెందారు. గురువారం మల్లారెడ్డి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి, అంతిమ యాత్రలో పాల్గొన్నారు. మండలంలోని రాంనగర్ గ్రామానికి వార్డు సభ్యురాలు ఆకులపెల్లి వినోద యాకయ్య దంపతుల కుమారుడు మధుకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను పరమార్శించారు.

జర్నలిస్ట్ కుటుంబానికి..

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన జర్నలిస్ట్ కాళేశ్వరం నర్సయ్య తల్లి ఉప్పలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి గురువారం ఆమె భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.5వేలు అందజేశారు. నర్సింహులపల్లి ఉపసర్పంచ్ గోనే నాగరాజు తండ్రి చిన్న కొమురయ్య ఇటీవల మృతి చెందగా ఎంపీపీ తిరుపతి రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గంగుల మనోహర్ రెడ్డి, రాజిరెడ్డి, సుమన్ ఉన్నారు.

మైనార్టీ గురుకులాల్లో చేర్పించాలి

న్యూశాయంపేట: పిల్లలను మైనార్టీ గురుకులాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను గురుకులం విద్యార్థులు కోరారు. దూపకుంట రోడ్డు వరంగల్ (జీ2) బాలికల గురుకులం నుంచి విద్యార్థినులు గురువారం ప్లకార్డులు, బ్యానర్లతో శంభునిపేట జంక్షన్ వరకు ర్యాలీ తీసి మానవహారం నిర్వహించారు.



పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు



కమలాపూర్ : విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు



ఆత్మకూరు: ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి



శాయంపేట : సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ సుభాషిణి

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

పరకాల: ప్రజాస్వామ్యంలో ఓటర్లు తమ ఓటు అనే వజ్రాయుధంతో తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ కోరారు. పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ ఎల్.ఇందిరాదేవి, డాక్టర్ వి.రాజయ్య, ఆర్.కుమారస్వామి, ఎ.అనిల్‌కుమార్, సి.హెచ్ సుస్మిత, రాజశ్రీ, డాక్టర్ జి.స్వప్న, దుప్పటి సంజయ్, టి.రాజు, శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని రెవెన్యూ శాఖ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.మాధవి ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌తో కలిసి రెవెన్యూ ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి అధ్యాపకులు ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాధవి, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు పొంది స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, అధ్యాపకులు పుష్పలత, కుమారస్వామి, శోభాదేవి, యామిని, శ్రీనివాస్, సంధ్యారాణి, కళాశాల, రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆత్మకూరు: 18ఏండ్లు నిండిన అర్హులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు నమోదులో బీఎల్‌ఓలు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంగీత, ఆర్ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

శాయంపేట : 18ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసిల్దార్ సుభాషిణి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు రెవెన్యూ సిబ్బంది, బిఎల్‌వోలతో కలిసి తహసిల్దార్ సుభాషిణి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలలో రాజకీయ పార్టీలు చేసే ప్రలోభాలకు ఓటర్లు తలొగ్గ వద్దని సూచించారు. ప్రజలకు మంచి చేసే నాయకులను ఎన్నుకునే అవకాశం ఓటు హక్కుతోనే సాధ్యమన్నారు. మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో, పాఠశాలలలో గ్రామ ప్రజలు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్‌కుమార్, ఏఆర్ఐ హుస్సేన్, ఏఎస్ఓ కుమారస్వామి, బీఎల్‌ఓలు రత్నమాల, జ్యోత్స్న, సదయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



దామెర: సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, తదితరులు

దామెర: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. డీటీ ఖురేషి, ఆర్ఐలు భాస్కర్ రెడ్డి, సంపత్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ వనజ, ఏఎస్సై రాజు, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

ఐనవోలు: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. వ్యాస రచన, నృత్యం, పాట పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఉడుత గూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు సారయ్య, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, మహేందర్, పవన్, ఉమాదేవి, గ్రామ కార్యదర్శి దీపిక అంగన్‌వాడీ ఆయాలు రాధిక, రవి తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రిపబ్లిక్ డే వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు చేస్తున్న జీపీ సిబ్బంది

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు పాఠశాలల్లో రిపబ్లిక్ డే వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ఘనంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయా కార్యాలయాల సిబ్బంది రిపబ్లిక్ డే వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు (శుక్రవారం) ఉదయం అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం పలు పాఠశాలల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందినవిద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

స్వచ్ఛత విద్యాలయంగా గిజూబాయ్ ప్లే స్కూల్



అవార్డు అందుకుంటున్న హెచ్ఎం, కరస్పాండెంట్

కమలాపూర్: మండల కేంద్రంలోని విశ్వభారతి గిజూబాయ్ ప్లే స్కూల్ 2021–22 విద్యా సంవత్సరానికి గాను స్వచ్ఛత విద్యాలయం అవార్డు అందుకుంది. ఈ మేరకు కమలాపూర్ మండల విద్యాధికారి రాంకిషన్‌రాజు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ, కరస్పాండెంట్ మధుబాబుకు అవార్డుతోపాటు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.

గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మసాగర్: గొర్రెలు, మేకల కాపరుల సమస్యలు పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శాతబోయిన రమేష్, కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని యాదవ సంఘం కమ్యూనిటీ భవనంలో గురువారం సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాదవులు తరతరాలుగా గొర్రెల, మేకల పెంపకం వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. యాదవులను అభివృద్ధి చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. సీజన్ వారీగా గొర్లు, మేకలకు వస్తున్న వ్యాధులకు ప్రభుత్వం అన్ని రకాల మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ గొర్రెల మేకల పెంపకందారుల సహకార సంఘాలకు గుర్తింపు కార్డుతో సంబంధం లేకుండా గతంలో మాదిరి పశుసంవర్ధక శాఖ అధికారులతో ఎన్నికలు జరపాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తొట్టె భీమన్న, జిల్లా సహాయ కార్యదర్శి మేకల సాంబరాజు, మండల ఉపాధ్యక్షుడు కాసాని పరుశరాములు, కార్యదర్శి మామిడి కుమార్, దాసరి చేరాలు, గంటే సాంబరాజు, మాదం కుమార్, మండల బాబు, శివులు, దాసరి కోటేశ్వర్, రాజయ్య, దాసరి కట్టయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గొర్రెల కాపరులు

హెల్మెట్ ధరించి ప్రాణాలు రక్షించుకోవాలి

దామెర: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు రక్షించుకోవాలని దామెర ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్4ఎస్ సెక్యూరిటీస్ సంస్థ ఎండీ రంజిత్ కుమార్ సౌజన్యంతో పంచాయతీ కార్యోబార్లకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. హెల్మెట్ ధరించడంవల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని వెల్లడించారు. రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్‌లేకుండా చనిపోయినవారిని చూసినతాను హెల్మెట్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లను, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టును తప్పక ధరించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రాజు, తదితరులు ఉన్నారు.



దామెరలో హెల్మెట్ పంపిణీ చేస్తున్న ఎస్సై అశోక్

జాతర టెండర్ల ఆదాయం రూ.6.9లక్షలు



వేలం నిర్వహిస్తున్న కమిటీ బాధ్యులు

వేలేరు: మండలంలోని పీచర గ్రామంలోని సమ్మక్క సారలమ్మ జాతర టెండర్లను జాతర కమిటీ చైర్మన్ కొయ్యడ మహేందర్ ఆధ్వర్యంలో గురువారం వివిధ దుకాణాలకు వేలంపాట నిర్వహించారు. కొబ్బరికాయలు రూ.52వేలు, బెల్లం రూ.97వేలు, కోళ్లు రూ.లక్షా 27వేలు, మద్యం రూ.3.33లక్షలకు వ్యాపారులు టెండర్లను దక్కించుకున్నారు. అనంతరం జాతర చైర్మన్ మహేందర్ విలేకరులతో మాట్లాడుతూ.. టెండర్ల ద్వారా వచ్చిన రూ.6.9లక్షలను ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పనకు వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మ్యాక రవీందర్, ఉపసర్పంచ్ శ్రీధర్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాంగోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మరిజె నర్సింగరావు, కోఆప్షన్ సభ్యులు జానీ, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హమాలీల హక్కుల పరిరక్షణ

గీసుకొండ : ఐక్యపోరాటాలతోనే కార్మిక హక్కుల పరిరక్షణ సాధ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని గొర్రెకుంట పారిశ్రామిక ప్రాంతంలోని హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించిన హమాలీ కార్మికుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తొలగించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించిందని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసి యాజమాన్యాలకు కట్టుబానిసలుగా మార్చే దిశగా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని మండిపడ్డారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతో కార్మికులకు కనీస వేతనం అమలు కావడం లేదని చెప్పారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమ్మె కరపత్రాలను ప్రదర్శించారు. సమావేశంలో హమాలీ సంఘం నాయకులు ఆడప యాదగిరి, రాజారపు శంకర్, సాయిలు శ్రీను, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐని సస్పెండ్ చేయాలి

కాశిబుగ్గ: గిరిజన మహిళపై దాడి చేసిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని గోర్ సేన నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ – నర్సంపేట ప్రధాన రహదారిలో తెలంగాణ జంక్షన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీసుకొండ మండలం జాన్‌పాకలో నివాసం ఉంటున్న తేజావత్ బుజ్జి అనే గిరిజన మహిళ.. ఈనెల 19న వ్యక్తిగత పనుల నిమిత్తం మెయిన్ రోడ్డుకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో జీపు(టాటా సుమో)లో నుంచి నలుగురు వ్యక్తులు దిగి రమేష్‌చంద్ర సార్ రమ్మంటున్నారని ఆమెను జీప్ దగ్గరకు తీసుకువెళ్లారని తెలిపారు. అనంతరం అకారణంగా ఆమెను కర్రలతో కొడుతూ కులం పేరుతో దూషించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సూచించారు.

బూత్‌స్థాయి సమావేశానికి తరలిన శ్రేణులు

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల బూత్ స్థాయి ఏజెంట్లు, నాయకులు గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశానికి వెళ్లారు. సమావేశానికి తరలిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవిందర్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జయపాల్‌రెడ్డి, చౌళ్లపల్లి సర్పంచ్ కంచ రవికుమార్, మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, మాజీ సర్పంచ్ ఉడుత మహేందర్ ఉన్నారు.

శాయంపేట: హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ సమావేశానికి మండలం నుంచి పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం 30మంది మండల నాయకులు తరలివెళ్లారు. ఎంపీటీసీ గజ్జి ఐలయ్య, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ కుక్కల భిక్షపతి, నాయకులు ఉన్నారు.



ఆత్మకూరు నుంచి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

దామెర: గురువారం హైదరాబాద్‌లో ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బూత్ లెవల్ అధ్యక్షుల సమావేశానికి మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. వెళ్లినవారిలో మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి, వర్కింట్ ప్రెసిడెంట్ పొలెపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, సీనియర్ నాయకులు సదిరం పోచయ్య, నల్ల సుధాకర్, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.



పరకాల: తరలుతున్న కాంగ్రెస్ శ్రేణులు

పరకాల: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్‌లెవెల్ ఏజెంట్స్ సమావేశానికి పరకాల మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పరకాల, నడికూడ మండలానికి చెందిన కాంగ్రెస్ శ్రేణుల బస్సులను కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు కట్కూరి దేవేందర్‌రెడ్డి, బుర్ర దేవేందర్ జెండా ఊపి ప్రారంభించారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



మోదీ ప్రసంగాన్ని వింటున్న బీజేపీ నాయకులు

పరకాల: యువత ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొని దేశానికి ఉపయోగపడే నాయకుడిని ఎన్నుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. పరకాల పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ సందేశాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమానికి పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, నాయకులు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

వరంగల్: యువతలో స్నేహభావం పెంపొందడానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఏనుమాముల పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ.మహేందర్ తెలిపారు. 3వ డివిజన్ పైడిపల్లిలో జై జవాన్ – జై కిసాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన 45వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ బాలికల చాంపియన్‌షిప్ శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. జై జవాన్ – జై కిసాన్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు జన్ను కుమార్, సెక్రటరీ ఇట్యాల శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టుషాపులు తొలగించాలి

- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్

ఎల్కతుర్తి: గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్టుషాపులను తొలగించి గీత కార్మికులను ప్రోత్సహించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో గౌడసంఘం అధ్యక్షుడు గౌడిశాల కుమారస్వామిగౌడ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా బెల్టుషాపులను ఎత్తివేయడంతో పాటు గీత కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని వెంటనే కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలన్నారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సట్ల మల్లయ్య, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి చెరాలిగౌడ్, లచ్చయ్య, ఉప్పలయ్య, కుమారస్వామి, రాజేష్, సుమన్, భిక్షపతి, విక్రమ్, కిషన్, సమ్మయ్య, బుర్ర అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహిళలకు అండగా సఖీ వన్ స్టాప్

ఐనవోలు: వేధింపులకు, లైగింక వేధింపులకు ఇతర సమస్యలను ఎదర్కొంటున్న మహిళలకు, బాలికలకు సఖీ వన్ స్టాప్ అండగా ఉండి వారి రక్షణకు కల్పించడం జరుగుతుందని సఖీ వన్ స్టాప్ ప్రతినిధులు వినీల, సరిత అన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సఖీ వన్ స్టాప్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ముల్కలగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళా అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. విడిపోయే భార్య భర్తలకు కౌన్సిలింగ్ ద్వారా కలపడం, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడ పిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్ఛిత్తి చేపించాలని వేధింపులకు గురి చేయడం, ఇతర వేధింపుల వల్ల మానసికంగా కృంగిపోయే మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించడం కోసం సఖీ వన్ స్టాప్ కేంద్రం కృషి చేస్తుందన్నారు. సఖీ కేంద్రంలో ఉచితంగా కౌన్సిలింగ్, పోలీస్, వైద్య సాయంతోపాటు, తాత్కాలిక వసతి కల్పిస్తామని తెలిపారు. సమస్యలను ఎదుర్కొంటున్న వారు 0870–2452112 లేదా టోల్ ఫ్రీ నంబరు 181కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో శంకరయ్య, ఎస్‌హెచ్‌జి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినీల

అంగన్‌వాడీ టీచర్లకు అవార్డు

శాయంపేట : మండలంలోని శాయంపేట, పత్తిపాక గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు శ్వేత, స్వప్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసినందుకు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ కర్ణకంటి వెంకటేశ్వర్లు బెస్ట్ బీఎల్‌ఓగా ప్రశంస పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా శ్వేత, స్వప్నను రెవెన్యూ అధికారులు తోటి బీఎల్‌ఓలు అభినందించారు.



ప్రశంస పత్రాలు అందుకున్న టీచర్లు